కడప-అన్నమయ్య
ప్రభాత వార్త
బుధవారం 18 ఫిబ్రవరి 2026

## పులి వాహనంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

రాయచోటి ఫిబ్రవరి 17 ప్రభాతవార్త.

రాయచోటి పట్టణంలోని మాండవ్య నది ఒడ్డున స్వయంభుగా వెలసిన శ్రీ భద్రకాళి శ్రీ వీరభద్ర స్వామి వారు ఈరోజు ఉదయం రాయచోటి పట్టణంలోని పురవీధులలో పులి వాహనంపై, ఈరోజు సాయంత్ర వేళల్లో రావణబ్రహ్మ వాహనం పైన విహరిస్తూ స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వడంతో భక్తుల ఆనందాలకు అవధులు లేకుండా పోయింది. స్వామి అమ్మవార్ల ఊరేగింపు భాగంలో చెక్కభజనలు, కోలాటాలతో రకరకాల విన్యాసాలతో స్వామి అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో ఊరోగించారు. ఈ దృశ్యం ఎంతో చూపురులకు ఆసక్తిని కలిగించింది.




## మార్చి మొదటి వారంలో ఎస్ఎస్సి హాల్ టికెట్లు.

### హాల్ టికెట్లలో తప్పుల సవరణకు మరోసారి అవకాశం

రాయచోటి ఫిబ్రవరి 17 ప్రభాతవార్త

మార్చి-2026లో 16.03.2026 నుండి 01.04.2026 నిర్వహించబడనున్న ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టికెట్లు మార్చి మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు జిల్లా డీఈవో సుబ్రహ్మణ్యం మరియు ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కొండూరు శ్రీనివాసరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యర్థుల హాల్ టికెట్లు బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచబడతాయని తెలిపారు. అదనంగా, సంబంధిత పాఠశాలల లాగిన్‌లు, లీఫ్ యాప్ మరియు వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర) ద్వారా కూడా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించబడుతుందన్నారు.అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాల్ టికెట్లలో ముద్రించబడిన విద్యార్థుల వివరాలు ఇంటిపేరు, అభ్యర్థి పేరు, జన్మతేదీ మరియు ఇతర వివరాలను పాఠశాల రికార్డులతో సరిపోల్చి జాగ్రత్తగా పరిశీలించవలసిందిగా సూచించారు. ఇంటిపేరు, అభ్యర్థి పేరు మరియు జన్మతేదీలలో ఏవైనా పొరపాట్లు గమనించిన పక్షంలో, వాటి సవరణ కోసం (యూ డి ఐ ఎస్ ఈ) పోర్టల్‌లో ప్రత్యేక సవరణ విండోను 31.03.2026కు ముందు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అందువల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అవసరమైన సవరణలకు తగిన అవకాశం కల్పించబడుతుందని స్పష్టం చేశారు.

# రుషికప్రియ హత్య కేసులో నిందితున్ని ఉరితీయాలి

మదనపల్లె, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:

అభం,శుభం తెలియని ఏడేళ్ళ చిన్నారి రుషికప్రియను అతి కిరాతకంగా హత్యాచారం చేసి ఆపై హత్య చేసిన మానవ మృగాన్ని ఉరి తీయాలంటూ కుటుంబసభ్యులతో పాటు ప్రజాసంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, పెద్దఎత్తున మహిళలు జాతీయ రహదారిపై బైఠాయించి మహాధర్నా చేపట్టారు. మంగళవారం ఉదయం తొలుత నీరుగట్టువారిపల్లెలో రోడ్డుపై బైఠాయించి దర్నా నిర్వహించి అటు నుంచి అన్నమయ్య సర్కిల్‌లో మహాధర్నాను సాయంత్రం వరకు చేపట్టారు. నీరుగట్టువారిపల్లెలోని కాట్లాటపల్లెరోడ్డులో ఉన్న చేనత కార్మికుడు గోఫినాద్, స్వర్ణలతల దంపతులకు రుషికప్రియ(7) బాలిక ఉంది. బాలిక స్థానికంగా ఉన్న పాఠశాలలో రెండవ తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం ఇంటినుంచి మిస్సింగ్ అయినట్లు కుటుంబసభ్యులు మదనపల్లె ఒకటవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదును స్వీకరించి విచారణ చేపడుతుండగా మంగళవారం తెల్లవారుజామున బాలిక రుషికప్రియ నీటిడ్రమ్ములో శవమై కనిపించింది. ఆ ప్రాంతంలోని సిసి కెమెరాల పుటేజ్‌లను పరిశీలించి ఆ ఇంటి సమీపంలోని కులవర్ధన్ అనే యువకుడు బాలికను సోమవారం రాత్రే తీసుకొని వెళ్ళి అతి కిరాతకంగా హత్యాచారం చేసి హత్య చేసి నీటి డ్రమ్ములో పడవేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనను జీర్ణించుకోలేని కుటుంబసభ్యులు సోకసముద్రంలో మునిగిపోయారు. బాలికను హత్యాచారం చేసి హత్యచేసిన మానమృగాన్ని ఉరి తీయాలంటూ ఉదయమే నీరుగట్టువారిపల్లెలోని వారి నివాసం వద్దకు బారీ ఎత్తున మహిళలు, ప్రజలు తరలివెళ్ళి ఇంటివద్దే నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బాలిక మృతదేహాన్ని నీటి డ్రమ్ములోనే ఉంచి తాళం వేసి పోలీసులకు ఇవ్వకుండా న్యాయం జరిగేవరకు మృతదేహాన్ని ఇవ్వమంటూ ఆ ప్రాంత ప్రజలు సైతం నీరుగట్టువారిపల్లె మెయిన్‌రోడ్డు వద్ద ధర్నా నిర్వహించారు. అటునుంచి అన్నమయ్య సర్కిల్ జాతీయ రహదారిలో మహాధర్నా నిర్వహించారు. మానవమృగమైన కులవర్ధన్‌ను ఎన్‌కౌంటర్ చేసి ఉరితీసేవరకు ధర్నాను విరమింప చేయమంటూ భీష్మించి రోడ్డుపైనే రోజంతా రోడ్డును స్థంభింపచేసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు దర్నా కార్యక్రమం వద్దకు చేరుకొని బాలిక కుటుంబసభ్యులతో హోమ్‌మంత్రి వంగలపూడి అనితతో ఫోన్‌లో మాట్లాడించారు. హోమ్‌మంత్రి ఫోన్‌లో మాట్లాడుతూ బాధితురాలి కుటుంబసభ్యులకు న్యాయం చేస్తామంటూ నిందితున్ని తీవ్రంగా శిక్షించేందుకు కఠిన చర్యలు తీసుకొంటామని కూడా చెప్పడం జరిగింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని కూడా చెప్పడం జరిగింది. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కూడా ఫోన్‌లో కుటుంబసభ్యులను పరామర్శించి నిందితున్ని కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెలుతానని వారికి హామీ ఇవ్వడం జరిగింది. బాధితురాలి కుటుంబసభ్యులకు అండగా వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అహ్మద్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, షమీంఅస్లాంలు ధర్నాలో వారికి సంఘీభావంగా పాల్గొని నింధితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసుల నిర్లక్ష్య వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. గంజాయి మత్తులో చిన్నారిని హత్యాచారం చేసి హత్యకు పాల్పడ్డాడని తెలిపారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్, బిజెపి, జనసేన, సిపిఐ నాయకులు క్రిష్ణప్ప, సాంబశివ, మురళి, సిపిఎం నాయకులు శ్రీనివాసులు, బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్, బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునిత్, శ్రీచందు, పోర్డుసంస్థ లలితమ్మ, చైతన్య స్వచ్ఛందసంస్థ ఆనంద్‌లతో పాటు పెద్దఎత్తున మహిళలు, ప్రజలు దర్నాలో పాల్గొని మానవమృగాన్ని ఉరితీయాలంటూ నినాదాలు చేయడం జరిగింది. హిజ్రాలు, ఆటో డ్రైవర్లు సైతం వారికి సంఘీభావంగా ధర్నా నిర్వహించారు. ధర్నా ఎంతసేపటికి విరమించకపోవడంతో పట్టణమంతా ట్రాఫిక్‌తో స్తంభించింది. ధర్నాను విరమింపచేసేందుకు కడపజిల్లా ఎస్‌పి ఎన్.విశ్వనాథ్, మదనపల్లె సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఎస్‌పి, సిఐలు కుటుంబసభ్యులతో చర్చించి యత్నించారు. బాధితురాలి కుటుంబసభ్యులకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వం దృష్టికి తీసకెళ్ళి నిందితునికి కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకొంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమింపచేశారు.


కుటుంబసభ్యులతో హోమ్‌మంత్రి ఫోన్‌లో మాట్లాడుతున్న దృశ్యం


మహాధర్నా చేపడుతున్న దృశ్యం

## ఓర్వ లేని తనానికి ఇది నిదర్శనం : మంత్రి

రాయచోటి ఫిబ్రవరి 17 ప్రభాతవార్త



మీడియా ఓర్వలేని తనానికి ఇది నిదర్శనమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు ఆయన ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరించే దానికి వచ్చిన బిల్ గేట్స్ రాష్టానికి రావడం ఎంతో గర్వపడాల్సింది పోయి ఆయనను దూషించడం సరికాదని పేర్కొన్నారు. రాజకీయం కోసం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీయడం భావ్యం కాదని ఆయన ఆరోపించారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ సేవలు ప్రపంచానికి తెలుసు అన్నారు. గతంలో హైదరాబాద్ అభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆచరణ, చొరవతో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రస్తుతం ఏపీ అభివృద్ధికి సహకరించేందుకు వచ్చిన అతిధిని మారు మాట్లాడడం సమంజసమా అని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అంతర్జాతీయ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ ఆకర్షంగాను, ఆదర్శంగానూ మారిపోతుందని ఆయన మీడియం ముఖంగా తెలియజేశారు. బిల్ గేట్స్ పర్యటనతో రాష్టానికి అంతర్జాతీయ గుర్తింపు పెరిగిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసినవారు ఇలాంటి దుష్ప్రచారాలను ఎన్నటికీ నమ్మరు అన్నారు.

## మదనపల్లె ఘటనపై మంత్రి హెచ్చరిక

రాయచోటి ఫిబ్రవరి 17 ప్రభాతవార్త

మదనపల్లె ఘటన సాధారణ నేరం కాదని అమా యక చిన్నారి మీద జరిగిన దాడి అంటే సమాజ గౌరవంపై దాడని దోషులు ఎవరైనా సరే, ఎంత ప్రభావశీలులైనా సరే చట్టం ముందు తలవంచాల్సిందే. ఇలాంటి దుర్మార్గాలకు భయపడేలా చేసే కఠినమైన శిక్ష తప్ప మరొకటి ఉండదని నిందితుల ఉద్దేశించి మీడియా సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లో మహిళల, బాలికల భద్రతపై ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదన్నారు.జీరో టాలరెన్స్ విధానంతోనే ముందుకు సాగుతుందని,ఈ కేసులో న్యాయం ఆలస్యం కాదు, బలహీనం అంతకన్నా కాదున్నారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు ఎవరు చేసినా సహించక కఠినంగా శిక్షిస్తామని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబం ఒంటరిగా లేదు ప్రభుత్వం అండగా ఉంటుందని దోషులకు శిక్షపడే వరకు పోరాటం ఆగదన్నారు.

### గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై

## స్పెషల్ పార్టీలతో కొనసాగుతున్న దాడులు

- అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా
- జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పడుతున్న పోలీసులు
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

కడప క్రైం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:

గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీసు అధికారులు స్పెషల్ పార్టీ సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ మరియు డ్రోన్ కెమెరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో టుటౌన్ సీఐ జి.ప్రసాదరావు ఆధ్వర్యంలో కడప నగరం వన్‌టౌన్ పీఎస్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో కడప సబ్ డివిజన్ స్పెషల్ పార్టీ సిబ్బంది దాడులు నిర్వహించారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో జల్లెడ పడుతున్నారు. మంగళవారం అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. నగరంలోని మార్కెట్‌యార్డు, అల్మాస్‌పేట వక్కలపేట, సంగంపేట, బిస్మిల్లానగర్, గౌస్‌నగర్, రిజ్వామసీదు, సాయిపేట, నకాష్ తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నిరంతరం కడప నగరంలోని అనుమానిత ప్రాంతాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పట్టడం జరుగుతుందని కడప డీఎస్పీ తెలిపారు.

### గోవిందా ...గోవిందా...

## వైభవంగా అత్తిరాలలో రథోత్సవం

### బండలాగుడు పోటీలు ప్రారంభించిన జగన్ మోహన్ రాజు


బండలాగుడు పోటీలు ప్రారంభించిన జగన్ మోహన్ రాజు

రాజంపేట, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:

గోవిందా ...గోవిందా... అంటూ భక్తులు గోవింద నామస్మరణతో ప్రముఖ పుణ్యక్షేత్రం అత్తిరాలలో రథోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. మంగళవారం అత్తిరాలలో రథోత్సవ వేడుకలను ఆలయ ఈవో సురేష్, పాలకవర్గం చైర్మన్ పూల నరసింహులు, ఆర్ అండ్ బి డిఈఈ ప్రారంభించారు. త్రేతేశ్వర స్వామిని మనసులో స్మరించుకుంటూ రథోత్సవంలో పాల్గొని, మనసా వాచా కర్మనా స్వామిని ప్రార్థిస్తే కోరిన కోరికలు తీరుతాయని ఈ ప్రాంత భక్తులు ఎంతో విశ్వాసంగా భావిస్తారు. అందుకే భక్తులు రథాన్ని లాగేందుకు పోటెత్తుతారు. అంతకుముందు ఆలయ పురోహితులు కామాక్షి త్రేతేశ్వర సమేత స్వామికి పూజలు నిర్వహించారు. పూజల అనంతరం రథోత్సవం ప్రారంభమైంది. సాయంత్రం అత్తిరాల సమీపంలో తెదేపా నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు అట్టహాసంగా బండలాగుడు పోటీలు ప్రారంభించారు.వృషభరాజముల పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరాగా,పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో హత్యరాల మాజీ చైర్మన్ పూల నరసింహులు,మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నేసుబ్బ నరసయ్య నాయుడు,మాజీ మండల అధ్యక్షులు కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు,పూల బాలాజీ,ఆలయ డైరెక్టర్లు,గ్రామ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకారంతో చాగలగొట్టపల్లి అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 17 ప్రభాతవార్త

నేటి నుంచి అనంతపురం గ్రామంలో జరగనున్న గంగమ్మ జాతరకు అమ్మవారి పుట్టినిల్లు అయిన చాగలగొట్టపల్లి నుంచి గంగమ్మ జాతరకు రావడానికి అమ్మవారి ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనమిస్తోంది మంగళవారం అర్ధరాత్రి నుంచి అమ్మవారు ప్రత్యేక పూజలు అందుకొని బ్యాండ్ వాయిద్యాలు సాంస్కృతిక కార్యక్రమాలతో అత్యంత వైభవంగా జాతరకు చేరుకుంటుంది అమ్మవారు చాగంటి పల్లి లో బయలుదేరినప్పటి అమ్మవారి ఎదురుగా యాటలో బోనాలు సమర్పిస్తారు అమ్మవారు చాపలగడ్డ పల్లి రాత్రి ఒంటిగంట కు అమ్మవారు పల్లకిలో బయలుదేరి ఉదయం ఏడు గంటలకు గంగమ్మ జాతరకు చేరుకుంటుంది అప్పటి నుంచి జాతర ప్రారంభమవుతుంది చేరుకుంటుంది.

## ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎంపీ

పులివెందుల,ఫిబ్రవరి 17, ప్రభాత వార్త :



పులివెందుల పట్టణంలోని తన నివాసానికి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలతో పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి సమావేశమై వారి సమస్యలను వినిపించారు. మంగళవారం ప్రజల నుంచి వచ్చిన వినతులు, అభ్యర్థనలను శ్రద్ధగా ఆలకించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు పై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యకర్తలు పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఎంపీ అవినాష్ రెడ్డి తుమ్మలపల్లి గ్రామాన్ని సందర్శించి స్థానికులతో మమేకమయ్యారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకుని, అవసరమైన చోట త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.తదుపరి కడపలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రథమ ప్రాధాన్యమని ఎంపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## తమపై పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్వో వీఆర్ఏల నిరసన

బద్వేలు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



తమపై పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ వీఆర్, వీఆర్ఎలు బద్వేలు తహశీల్దారు కార్యాలయం వద్ద సంయుక్తంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమకు భూముల రీసర్వేతో పాటు హౌస్ సర్వే చేయాలని ప్రభుత్వం తమపై అధిక ఒత్తిడి తెస్తోందని, దీంతో తాము ప్రజలకు పూర్తి సహకరించలేకున్నావ దీని తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమకు ఒత్తిడి అధికమైందని, కావున తమకు ఒకేసారి రెండు, మూడు పనులు కేటాయించడం సరికాదని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని జిల్లా వీఆర్ఏ సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ జగదీశ్వర్రెడ్డి పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రిలు తమ సమస్యపై దృష్టిసారించి పని ఒత్తిడి తగ్గించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల వీఆర్వోలు, వీఆర్ఎలు పాల్గొన్నారు. అనంతరం తహసిల్దార్ ఉదయభాస్కర్ రాజుకు వినతిపత్రం అందజేశారు.

## 23వ వార్డులో వైఎస్ఆర్‌పి రచ్చబండ

మదనపల్లి ఫిబ్రవరి 17 ప్రభాతవార్త



మదనపల్లి మున్సిపాలిటీలోని 23వ వార్డు పరిధిలో మంగళవారం వైఎస్ఆర్సిపి యువ నాయకులు సాయి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని బెంగళూరు రోడ్డు, కేఎంఆర్ కాంప్లెక్స్ లో నిర్వహించిన ఈ రచ్చబండ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ రెడ్డి, ఏపీఎండిసి కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్ పర్సన్ షమీమ్ అస్లాం, మున్సిపల్ వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండు సంవత్సరాలు కావస్తున్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు అందాయని చెప్పారు. తన సతీమణి, కౌన్సిలర్ గిరిజ ఆధ్వర్యంలో వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని చెప్పారు. పేదలకు నివాస గృహాలు, పింఛన్లు, రైతు భరోసా, విద్య దీవెన, అమ్మ ఒడి, సున్నా వడ్డీ కింద రుణాలు, వసతి దీవెన వంటి పథకాలు అందాయని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం పై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయమని తెలిపారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని చేసుకునే అవకాశాన్ని ప్రజలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో వార్డు పరిధిలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యానికి ఆల్బెండజోల్ చాలా అవసరం

పీలేరు ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:



పిల్లల ఆరోగ్యానికి ఆల్బెండజోల్ చాలా అవసరమని పీలేరు ఎంపీడీవో శివశంకర్, తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ శ్రీగిరీష తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా గూడరేవుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ 400 యంజి మాత్రలు పంపిణీ చేశారు. "పిల్లల ప్రవర్తన సమాజానికి ఎంతో మేలు" అనే అంశంపై విద్యార్థులకు వివరించి, మాత్ర ఉపయోగాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ బాగా చదవాలన్నా, ఆరోగ్యంగా ఎదగాలన్నా కనీసం ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ 400 యంజి మాత్ర తప్పక తీసుకోవాలని వారు అన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు చక్కగా ఉపకరిస్తుందని, బాలల ఆరోగ్యం దేశానికి సౌభాగ్యమని, వీటిని 119 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. తలుపుల పిహెచ్ సి పరిధిలో గుర్తించిన 1 నుండి19 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లలను 10,824 మందిని గుర్తించడం జరిగిందని, వీరిలో 10,381 మంది పిల్లలు అనగా 95.91శాతం మంది పిల్లలు వీటిని వినియోగించుకున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కమనీయం వీరబ్రహ్మేంద్రుని మహా ప్రసాదం..

బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:

కాలజ్ఞాన సృష్టికర్త జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం నందు మహాశివరాత్రి మహోత్సవాలలో 4వ రోజు మంగళవారం జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం మహా నివేదినా మందిరములో మఠాధిపతులు పూజ శ్రీ శ్రీ శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారి ధర్మపత్ని శ్రీ ఉమాదేవి అమ్మగారి చేతులు మీదుగా భక్త జనావళికి మహా ప్రసాదం వితరణ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్థానిక ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రసాదాన్ని అత్యంత పవిత్రంగా స్వీకరించారు. ఈమహా ప్రసాదం ఉభయ దాతలు కీర్తిశేషులు ధర్మవరం సుందరాచార్యులు జ్ఞాపకార్థం వీరి కుమారులు కీర్తిశేషులు డి.ఎస్ దత్తాత్రేయ శర్మ జ్ఞాపకార్థం వీరి భార్య సూర్య కుమారి 3/తి శ్రీదేవి అమ్మళ్ స్ట్రీట్ , సుభాష్ నగర్, క్రోమ్ పేట్, చెన్నై ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే రాత్రికి పుష్ప రథోత్సవం పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

### ప్రసాద వినియోగంతో ముగిసిన ఉత్సవాలు..

జగన్మాత ఈశ్వరిదేవి అమ్మవారు ఆలయం లో మహా ప్రసాద వినియోగంతో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిసినట్లు కార్య నిర్వహణ అధికారి జగన్మోహన్ రెడ్డి తెలిపారు.మహాశివరాత్రి మహోత్సవాలలో చివరి రోజు మంగళవారం జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠమునందు జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతులు శ్రీ శ్రీ వీర శివ కుమార స్వాములవారు ఆధ్వర్యంలో మహా ప్రసాదాన్ని క్యూ లైన్ ద్వారా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులకు మహా ప్రసాదాన్ని అందిస్తున్న మఠం మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర శివకుమార స్వాములవారి తమ్ముడు శ్రీ సంపత్ కుమారస్వామి.



## వారపు సంతలో నిరుపయోగంగా ఉన్న రూములు

### రాజంపేట పార్లమెంటు అదికార ప్రతినిధి బాబు రెడ్డి


పీలేరు ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:

పట్టణంలోని వారపు సంత లో అసంపూర్తి నిర్మాణాలతో రూములు ఏర్పాటు చేసి వ్యాపారస్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో వారపు సంతలో అనధికారికంగా నిర్మించిన రూములతో పంచాయతీ ఆదాయానికి గండి పడిందని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోట పల్లి బాబు రెడ్డి ఆరోపించారు. అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి శ్రేణులతో సమావేశంలో అయ్యారు. ఈ కార్యక్రమం పీలేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామ మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారపు సంతలో సుమారు 30 రూములు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించి నట్లు మాకు సమాచారం ఉందని, పంచాయతీ అధికారులకు వివరణ కోరగా అందులో వచ్చే ఆదాయం పంచాయతీకి చేరడం లేదని అధికారులు తెలియ జేయడం జరిగిందని అన్నారు. నిరుపయోగంగా నిర్మించిన రూములతో వారపు సంతకు వచ్చే రైతులు కూరగాయలు అమ్ము కోవడానికి స్థలం లేక, ఆరాకొరా స్థలంలో రోడ్డు మీద కూర్చొని వ్యాపారం చేస్తున్నారని. దాంతో వారపు సంతలోకి వచ్చే ద్విచక్ర వాహన దారులు, ఆటోల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగు తుందని, రైతులు, చిరు వ్యాపారులకు స్థానం కల్పించి, సంబంధిత అధికారులు వారపు సంతలో ఉన్న అనధికారికంగా నిర్మించిన రూములపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటిని ఉపయోగంలోకి తీసుకొస్తూ గ్రామ పంచాయతీ కు ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు అంకాలమ్మ ఆలయ చైర్మన్ కోడి రామకృష్ణా రెడ్డి, ప్రముఖ టీడీపీ నేత పోలిశెట్టి సురేంద్ర, (సాపల సూరి), పురుషోత్తం రెడ్డి,రెడ్డి ముని, చెన్నారెడ్డి కాలనీ హరి, క్రాంతి,వెంకి, ఎర్ర సీను తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కోటపల్లి బాబు రెడ్డి

## సమస్యలపై డిఆర్ఎంకు వినతి

**యర్రగుంట్ల ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**



రైల్వేస్టేషన్‌లో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గుంతకల్ డీఆర్ఎంకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, వామపక్ష నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. యర్రగుంట్ల రైల్వేస్టేషన్ నందు 1, 2 ప్లాట్ ఫారంపై అదనపు షెడ్లను ఏర్పాటు చేసి కలమల్ల అండర్ రైల్వే బ్రిడ్జిని మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు షెడ్ల నిర్మాణం కొరకు త్వరలోనే టెండర్లు పిలుస్తామని మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిఆర్ఎం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

**యర్రగుంట్ల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:**



1 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలందరూ తప్పకుండా నులిపురుగుల నివారణ మాత్రలను వేసుకోవాలని చిలంకూర్ ప్రభుత్వం వైద్య అధికారి గణేష్ రెడ్డి సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం చిలంకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నులిపురుగుల ద్వారా పిల్లల్లో శారీరక ఎదుగుదల ఉండక పోవడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలన్నారు. అనంతరం పాఠశాలలో వంట గదిని పరిశీలించి, విద్యార్థులకు మోను ప్రకారం భోజనం పెట్టాలని నిర్వాహకులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో నాగమునిరెడ్డి హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పాఠశాల ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కఠినంగా శిక్షించాలి : కళ్యాణ్‌భరత్

**చౌడేపల్లి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**



మదనపల్లి నీరుగట్టువారిపల్లిలో చిన్నారిని హత్య చేసిన మానవ మృగంపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైకాపా విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్‌భరత్ డిమాండ్ చేసారు. స్థానికంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, మద్యం బెల్టుదుకాణాలు విపరీతంగా పెరిగి పోతోందన్నారు. దీనివల్ల చిన్నారులు, మహిళల మాన ప్రాణాలకు భంగం వాటిళ్ళుతోందన్నారు. మహిళా చట్టాలను బలోపేతం చేసి రక్షణ కల్పిస్తామన్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. సమాజంలో మేకవన్నె పులుల నుంచి బాలికలు, మహిళలను కాపాడేందుకు చట్టంలోనూ బలమైన సవరణలు తీసుకురావాలన్నారు. నీరుగట్టువారిపల్లి రుషికప్రియను దారుణంగా హత్యచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. మృతురాలి కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేసారు.

## గడ్డివామి దగ్ధం : ఆస్థినష్టం

**చౌడేపల్లి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గడ్డివామి దగ్ధమై రూ. ఆస్థినష్టం వాటిళ్ళిన సంఘటన మంగళవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు కథనం మేరకు మండలంలోని పెద్దకొండామర్రి పంచాయతీ కోటూరుకు చెందిన సుగుణమ్మకు గ్రామానికి సమీపంలో గడ్డివామి వుంది. అందులోంచి మంటలు చలరేగడంతో గ్రామస్తులు అదుపు చేసే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది తరలివచ్చి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు ధూపమానం సేవించి ముక్కలు పడేయడం వల్లనే ప్రమాదం సంభవించిందని ఆయన వివరించారు.

## నేడు పంచాయతీల ఆస్తుల రక్షణ కోసం సమావేశం

**చౌడేపల్లి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**

పంచాయతీల ఆస్తుల రక్షణ కోసం ఈనెల 18న సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ లీలామాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పంచాయతీలకు చెందిన ఆస్తుల రక్షణ, ఉమ్మడి భూముల వివరాలు, పంచాయతీ రిజిష్టర్‌లో నమోదు చేయుట, అక్రమ ఆక్రమణలు తొలగింపు, గ్రామ, మండల కమిటీలు ఏర్పాటు వంటివి సమావేశంలో చర్చిస్తామనీ, మండలంలోని అధికారులందరూ తప్పక హాజరు కావాలన్నారు.

## ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**బద్వేలు అర్బన్ ,ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**



జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యా, ఆరోగ్యశాఖ సంయుక్తంగా నిర్వహించాయి. మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ ప్రమీల, మండల అభివృద్ధి అధికారి, మండల వైద్యాధికారులు, పట్టణ వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ మాట్లాడుతూ నులిపురుగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆల్బెండజోల్ మాత్రల ప్రాముఖ్యత, వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. చెన్నకేశంపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. బద్వేల్ డివిజనల్ ఉపజిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మల్లేష్ పాఠశాలలు, అంగనవాడీ కేంద్రాలను సందర్శించి, మాత్రల పంపిణీ, చేతుల శుభ్రత, అలాగే ఎలాంటి ప్రతికూల ప్రభావాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శర్మ, సబ్ యూనిట్ ఆఫీసర్ నర్సింహారెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్య, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్‌రావు, ఏఎన్ఎం భానుమతి, ఆశా కార్యకర్తలు సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి మత్తుతోనే ఘాతకాలు : పునిత్

**మదనపల్లె, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**

యువత గంజాయి మత్తుకు బానిస అవుతుండడం వల్లే హత్యాచారాలు, హత్యలు చోటు చేసుకుంటున్నాయని బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునిత్ తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీరుగట్టువారిపల్లెలోని ఏడేళ్ళ చిన్నారి రుషికప్రియను హత్యాచారం చేసి హత్య చేసిన మానవమృగం కులవర్ధన్ గంజాయి మత్తులో ఉండడం వల్లే ఈ ఘటనకు పాల్పడడం జరిగిందని ఆయన ఆరోపించారు. రాజకీయ పార్టీ అండదండల వల్లే గంజాయికి యువత బానిసలు అవుతున్నారని గంజాయిమత్తులో ఎలాంటి అఘాయిత్యానికైనా యువత పాల్పడుతుందన్నారు. పోలీసులు గంజాయి విక్రయించే ప్రధాన ప్రాంతాల్లో దాడులు జరిపి గంజాయి విక్రయాన్ని అరికట్టాలన్నారు. చిన్నారి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకొని నిందితున్ని బహిరంగంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విలేకర్లతో మాట్లాడుతున్న పునిత్

## చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టడం సరికాదు

**ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**



చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టడం సరికాదని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డి తెలిపారు. మంగళవారం వారి, బిజెపి 2వ పట్టణ అధ్యక్షుడు పాలెం రెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో మునిసిపల్ దౌర్జన్యాలని అరికట్టాలని నిరసన చేపట్టారు. తాము కొత్త మార్కెట్‌ను సందర్శించడం, గాంధీరోడ్డులో వుండే చికెన్, మటన్, చేప షాపుల దగ్గర జరుగుతున్న అక్రమ వసూళ్ల గురించి షాపుల యజమానులను అడిగి తెలుసుకున్నామన్నారు. అనంతరం షాపుల యజమానులు కలిసి మునిసిపల్ ఆఫీస్‌కి ర్యాలీగా వెళ్లి మునిసిపల్ ఆఫీస్‌ని ముట్టడి చేశారు. కమీషనర్‌కి ఫోన్ చేస్తే ఎలాంటి స్పందనలేదని, సామాన్యుల దగ్గర దోచుకోవడం సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.జయలక్ష్మి, సుధాకర్ రెడ్డి, రూరల్ అధ్యక్షుడు మురళి రెడ్డి, ఒకటవ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర రావు, కో కన్వీనర్ గౌరీశంకర్, శివాలయం బోర్డు మెంబెర్ విక్రాంత్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు వెంకట్ నాయుడు, స్టేట్ కౌన్సిల్ మెంబెర్ గురు, కంబగిరి, పట్టణ ప్రధాన కార్యదర్శి గురురాజేష్, రవిశంకర్, మారుతీ, చరణ్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిందితున్ని శిక్షించేందుకు చర్యలు తీసుకుంటాం

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:**



అభం, శుభం తెలియని చిన్నారి రుషికప్రియను హత్యాచారం చేసి అతి కిరాతకంగా హత్య చేసిన నిందితుడు కులవర్ధన్‌ను కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం మృతురాలి కుటుంబసభ్యులతో అమరావతినుంచి ఎమ్మెల్యే ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారిని హత్య చేయడం చాలా బాధాకరమని, నిందితునికి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెలుతానన్నారు. ఇప్పటికే ఈ ఘటనపై ముఖ్యమంత్రి, హోమ్‌మంత్రి అనిత, రాష్ట్ర మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళ్ళామన్నారు. నిందుతునికి కఠిన శిక్షలు పడి మరో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వంకఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. తాను చిన్నారి కుటుంబసభ్యులకు అండగా ఉంటానన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**తొండూరు ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:**



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజ్, పాలిటెక్నిక్ కళాశాల, డాక్టర్ అంబేద్కర్ గురుకులం యందు 2900 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. అంబేద్కర్ గురుకులం యందు డివిజనల్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి ద్వారా మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ రక్తహీనత, విరోచనాలు, చర్మవ్యాధులు రాకుండా చేయవచ్చును మరియు వయసుకు తగిన ఎత్తు, బరువు ఉండ్నట ,చదువులో చురుకుదనం కలిగి ఉంటారని తెలిపారు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లయ్య మాట్లాడుతూ చేతుల శుభ్రత, మరుగుదొడ్ల వాడకం, ఆకుకూరలు,కాయగూరలు, పండ్లు కడిగిన తర్వాతనే వాడాలని ,సురక్షిత మంచినీటిని వాడాలని. పాద రక్షలు ధరించాలని తెలిపారు. ఈ కార్య క్రమం లో మండల అభివృద్ధి అధికారి విష్ణుప్రసాద్, డాక్టర్ శ్రావణ్ కుమార్, ప్రిన్సిపాల్ ఉషారాణి, డిప్యూటీ ఎంపీడి.ఓ, ఆరోగ్య కార్యకర్తలు నాగేశ్వరీ, సుజాతలు ఉపాధ్యాయ సిబ్బంది,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యలు తక్షణం పరిష్కరించాలి : యుటిఎఫ్

**రాజంపేట, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:**



రణభేరిలో పాల్గొన్న యుటిఎఫ్ నేతలు

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. మంగళవారం విజయవాడలో జరిగిన రణభేరి 2.వీ కార్యక్రమంకు రాజంపేట నుంచి యుటిఎఫ్ నేతలు తరలివెళ్లారు. ధర్నా చౌక్ వద్ద ధర్నా, ఆందోళనలో పాల్గొన్నారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా జేపీసీ అధ్యక్షులు నాయకులు విద్యాసాగర్ మాట్లాడుతూ పిఆర్సి ఉద్యమానికి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాంది పలికిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిఆర్సి కమీషన్ వేసి మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని లేనిపక్షంలో ప్రకటించే దాకా గేగినీ సంఘం నిద్రపోదని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమానికి రాజంపేట మండలం నుండి జిల్లా కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, రమణమూర్తి, మండల అధ్యక్షుడు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి శివయ్య జిల్లా కౌన్సిలర్ కె. రామచంద్ర, శ్రావణ్ కుమార్ రెడ్డి హాజరై విజయవంతం చేశారు.

## అసాంఘిక కార్యక్రమాలు అరికట్టడంలో ఎమ్మెల్యే విఫలం

**ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**



నియోజకవర్గంలో జరిగిన గత ఎన్నికలలో పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలపై పాదం మోపి అరికడతానున్న ఎమ్మెల్యే వరద హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక దొరసానిపల్లెలోని ఆయన నివాసంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో వైసీపీ పాలనలో అప్పటి టిడిపి ఇంచార్జ్ ప్రవీణ్, ఆ తర్వాత ఎన్నికలకు ముందు రంగ ప్రవేశం చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి తాను అసాంఘిక కార్యక్రమాలు నిర్వహణకు సహకారం అందిస్తున్ననాని, అందుకు తనకు వచ్చిన ఆదాయం తోనే దానధర్మాలు చేయడంతో పాటు తన నివాస గృహం నిర్మాణం చేశానని విమర్శించారని, వరద తాను ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యక్రమాలు నిర్మూలిస్తానని చెప్పి, ఎన్నికలలో విజయం సాధించి, ప్రస్తుతం 20 నెలల కాలంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్మూలించక పోగా, నిర్వాహకుల నుండి ఎమ్మెల్యే కుమారుడు నంద్యాల కొండారెడ్డి కి డబ్బులు అందడం లేదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఆ మాటలు ఏమయ్యాయో ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గుర్రం లావణ్య, నాయకులు భీముని పల్లె నాగరాజు, గుర్రం ప్రకాష్, గజ్జల కళావతి తదితరులు పాల్గొన్నారు.

## ఖాతాదారులకు బ్యాంకు సేవలు

**సుండుపల్లె, పిబ్రవరి 17, ప్రభాతవార్త :**




రైతుల ఆర్థిక అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఎంతో దోహదపడుతుందని బ్యాంకు మేనేజర్ వెలమూరి హరీష్ తెలిపారు. మంగళవారం రాయవరం గ్రామపంచాయతీ కావలపల్లికి చెందిన చనంశెట్టి వెంకటేష్ కు రూ.23 లక్షలలోన్‌ను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఇచ్చినట్లు తెలిపారు. వరి కోత మిషన్ కొనుగోలు కోసం ఆ రైతు బ్యాంకును ఆశ్రయించడంతో లోను మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతులు ఖాతాదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు రకాల లోన్లు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ద్వారా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అలాగే ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకు సేవలను అందిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం రైతు కొనుగోలు చేసిన వరి కోత మిషన్ను బ్యాంకు సిబ్బందితో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## అనంత విశ్వసిద్ధాంతకర్త బ్రూనో

**సిద్ధవటం ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**



సిద్ధవటంలోని బెటాలియన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బ్రూనో సత్యాన్వేషణ దినాన్ని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి సంబంధించి "సత్యాన్వేషణ దినం" పేరుతో ప్రత్యేక కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష మాట్లాడుతూ అనంత విశ్వ సిద్ధాంతకర్త బ్రూనో ఖీ ప్రతిపాదించిన సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని 30 సంవత్సరాల తర్వాత ప్రపంచమంతా కొన్ని సవరణలతో ఆమోదించిందన్నారు. బ్రూనో బలిదానానికి గుర్తుగా వైజ్ఞానిక లోకం, విద్యార్థి వర్గాలు, ప్రజా సైన్స్ ఉద్యమ కార్యకర్తలు ఫిబ్రవరి 17వ తేదీన సత్యాన్వేషణ దినంగా పాటిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోతులూరయ్యా, ఉపాధ్యాయులు యూనస్, సిరాజుల్ల, రవిశంకర్, రమణయ్య, నరసింహులు, రాజమ్మ, పరమేశ్వరి, సుజాత, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిర్మూలనకు రథయాత్ర

**గాలివీడు, ఫిబ్రవరి 17(ప్రభాతవార్త):**



జిల్లాలో బాల్యవివాహ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ కార్యక్రమం భాగంగా మంగళవారం ఒక ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీఓ చేతుల మీదుగా బాల్య వివాహ విముక్తి రథయాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల బాల్యవివాహాలపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందని, తద్వారా వాటిని అరికట్టవచ్చని తెలిపారు. బాల్యవివాహాలను అరికట్టడమే లక్ష్యంగా మండల పరిధిలో ఈ రథయాత్ర కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సిబ్బంది, రెడ్స్ సంస్థ సిబ్బంది శ్రీనివాసులు, భారతమ్మ, మల్లిక, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## 20న జాబ్ మేళా

**బద్వేలు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

పట్టణంలోని ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 20న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సి. విజయ్ వినీల్ కుమార్, నియామక విభాగ అధికారి పి. శ్రీనివాసరెడ్డి, సమన్వయకర్త మహాలక్ష్మిల సహకారంతో నిర్వహించే ఈ ఉపాధి మేళాలో జైఅలుకాస్, భారత్ బయోటెక్, ఎల్ఐసి, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తదితర మొత్తం 13 సంస్థలు పాల్గొని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మరియు అంతకంటే పై చదువులు పూర్తి చేసిన అభ్యర్థులు తమ జీవిత వివరణ పత్రం, విద్యార్హత ధృవపత్రాలతో హాజరుకావాలని సూచించారు. బద్వేల్ పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7893574673, 9704940639 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## ఉచిత కంటి అద్దాల పంపిణీ

**ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**



స్థానిక పవర్ హౌస్ రోడ్డులోని హైస్కూల్లో 29 మందికి మరియు రాజబాట వీధిలోని బాలికల ఉన్నత పాఠశాలలో 21 మందికి ఆప్తాల్మిక్ అధికారి కేజే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాముల పేట, నడింపల్లి వైద్యాధికారులు డాక్టర్ శ్రీ భరత్, డాక్టర్ మురళీకృష్ణతో కళ్ళ అద్దాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మాట్లాడుతూ మంచి పోషక విలువలతో కూడిన ఆహారముతో పాటు, క్రీడలు ఆడుతూ మంచి వెలుతురు ఉన్న ప్రదేశంలో మాత్రమే చదువుకుంటూ సెల్ ఫోన్లకి దూరంగా ఉండాలని సూచించారు. డిప్యూటీ హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రమం తప్పకుండా కళ్ళ అద్దాలను వాడుకుంటూ ప్రతి సంవత్సరం జరిగే స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్స్ లో ప్రతి ఒక్క విద్యార్థి హాజరై వారి కళ్ళను పరీక్షించుకొని కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. కంటి పరీక్షలు జరిగే జరిగేటప్పుడు ఏ ఒక్క విద్యార్థి కూడా గైర్హాజరు కాకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డ్ హెల్త్ సెక్రటరీలు రాధా, సుశీలమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎం రాహత్' గొప్ప వరం

**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**



రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పీఎం రాహత్' పథకం ఎంతో ఉపయుక్తమని బద్వేల్ అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ పథకం ద్వారా మానవతా దృక్పథంతో ముందడుగు వేసిందన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో అత్యవసర చికిత్స అందించడం ద్వారా అనేక ప్రాణాలను రక్షించవచ్చున్నారు. ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడంతో పాటు, ప్రమాదం జరిగిన రోజు నుంచి ఏడు రోజుల వరకు ఉచిత చికిత్స అందించబడుతుందని వివరించారు. అలాగే, ప్రమాదం జరిగిన వెంటనే డయల్ 112కు కాల్ చేస్తే అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ పథకంపై ప్రజలు అవగాహన పెంచుకుని, అత్యవసర పరిస్థితుల్లో సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## త్రాగునీరు కోసం మహిళలు ఇబ్బందులు

**సిద్ధవటం ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**

త్రాగునీటి పైపు పగిలిపోయి తాగునీరు వృధాగా పోతున్న మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారని ఆ ప్రాంత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు సిద్ధవటం మండలం మాధవరం 1 గ్రామంలోని ఆలీనగర్లో త్రాగునీటి పైపు గతవారం రోజుల క్రిందట పగిలిపోయి త్రాగునీరు వృధాగా పోతున్న మరమ్మత్తులు చేపించవలసిన అధికారులు పట్టించుకోవడంలేదని ఆప్రాంతం మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతం మహిళలు మంగళవారం మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మంచి నీటి పైపు పగిలిపోయి త్రాగునీరు వృధాగా పోతున్న మరమ్మతులు చేయలేదని తాగునీరు రాక అవస్థలు పడుతున్నామని ప్రజల సమస్యలు పరిష్కారం చేయాలని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు త్రాగునీటి సమస్యపై డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్ వివరణ కోరగా ఆలీనగర్లో త్రాగునీటి పైపు పగిలిపోయినట్లు సమాచారం వచ్చిందని దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి ప్రజలకు త్రాగునీటి సమస్య పరిష్కారం చేస్తామని తెలిపారు.

## వైభవంగా అగస్తేశ్వర స్వామి రథోత్సవం

**పుంగనూరు రూరల్ ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**



మండలంలోని శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం పుష్పాలతో అలంకరించిన రథంపై స్వామివారిని ఊరేగించారు. ఈ సందర్భంగా పుంగనూరు పరిసర గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయానికి రథానికి పుష్పాలంకరణ సేవ జనసేన నాయకుడు వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

## ఉపాధి హామీ పథకంలో బట్టబయలైన అవినీతి

**కాశినాయన ఫిబ్రవరి 17 ప్రబతవార్త:**




కడప జిల్లా అడిషనల్ పీడీ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో కాశినాయన మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకంపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కిందిస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్ నుండి పై స్థాయి అధికారుల అవినీతిపై ఆరా తీసిన అడిషనల్ పీడీ రామలింగారెడ్డి. ప్రతి పంచాయతీలో ఉపాధి పథకంలో అవినీతి చేస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిపై అధికారులకు నివేదిక సమర్పిస్తాము తదుపరి చర్యలు కలెక్టర్ తీసుకుంటారన్న అడిషనల్ పీడీ అన్నారు. రాష్ట్రంలో ఎక్కడలేని అవినీతి కాశీనాయన మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉందన్న పీడీ రామలింగారెడ్డి. మండలంలో అన్ని పంచాయతీలలో కన్నా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గంగన్న పల్లె పంచాయతీలో జరిగిన అవినీతి ఎక్కడ లేదన్న పీడీ. కార్యక్రమంలో డివిఓ జువేద, ఏపీడి మైథిలి, ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి, డిఆర్పిలు చిన్నయ్య, కిషోర్, సుబ్బరాయుడు మరియు సంబంధిత అధికారులు.

## వైభవంగా వాళీశ్వర స్వామి రథోత్సవం

**రామసముద్రం పిబ్రవరి 17 ప్రభాతవార్త**



మండలంలోని ఆర్ నడింపల్లె గ్రామ పంచాయతీ బల్లసముద్రం గ్రామ సమీపంలో కొండ పై కొలు వైన వాళీశ్వర ఆలయం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి అమ్మవార్ల రథోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా సాగింది. వేలాది మంది భక్తులు మధ్య ఉత్సవ మూర్తులైన శివ పార్వతులు, మహా గణపతి ప్రత్యేక అలంకరణతో రథంపై ప్రతిష్టించి ఆలయం చుట్టూ ఘనంగా ఊరేగించారు. అర్చకులు లోకనాథం దీక్షితులు, అర్చకబృందం వేదమంత్రోచ్చారణల మధ్య పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి రథోత్సవ ఏర్పాట్లను ప్రత్యక్షంగా సిబ్బందితో కలిసి పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారు. రథోత్సవాన్ని ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా దిగ్విజయంగా నిర్వహించిన ఎస్సై ఉమామహేశ్వర్‌రెడ్డిని ఆలయ అర్చకులు లోకనాథం దీక్షితులు శాలువ కప్పి పూలమాల వేసి వేద మంత్రాలతో ఆశీర్వాదములతో దీవించారు.

## శివాజీ జయంతికి తరలి రండి

**పుంగనూరు ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**

చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఈనెల 22వ తారీఖున పుంగనూరు పట్టణంలో ఆదివారం నిర్వహించే మోటార్ సైకిల్( ర్యాలీ )శోభాయాత్ర కొరకు అమ్మిగాని పల్లి, కురపల్లి,చిన్న కొండ చర్ల,పెద్ద కొండ చర్ల, భీమ గాని పల్లి, రాంపల్లి,గాంధీపురం గ్రామాలలో సమావేశంలో ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్‌తో పాటు ఆయన కుమారుడు శంభాజీ సేవలు భరతమాత ఎప్పటికీ మర్చిపోదున్నారు. వారి త్యాగాలకు నేరతిగా కృతజ్ఞతగా హైందవ సామ్రాజ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి హిందూ బంధువు చేతులు కలపాలని చత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి :సిపిఎం

**పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**

పట్టణంలోని జగనన్న కాలనీలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించాలని అదేవిధంగా గుంటూరు బాపనయ్య కాలనీలో ఉన్న ఇండ్లకు ఇంటి పన్ను డోర్ నెంబర్ ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలోని ఏవో కు వినతిపత్రం అందించారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు నివాసముంటున్న కాలనీలను ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 2015 నుండి గుంటూరు బాపనయ్య కాలనీలో నివాసం ఉంటున్న వారికి కావలసిన మంచి నీటి సౌకర్యం,విద్యుత్ సరఫరా, రోడ్లు మొదలైనవి ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.

## వ్యవసాయ పైర్లను సందర్శించిన బాలగంగాధర్ రెడ్డి


**మైదుకూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**



మండలంలోని సరస్వతి పేట, గుంటూరు కొట్టాలు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి, పలువురు సిబ్బంది వ్యవసాయ పైర్లను సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా వరి, మినుము, మొక్కజొన్న, పంటలో వచ్చే సమస్యలు మరియు ఆ గ్రామాల్లో సాగు చేసిన పంటల స్థితిగతుల గురించి చర్చించడం జరిగింది. రైతులు ప్రభుత్వం ద్వారా వచ్చే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్,రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రభుత్వం ద్వారా అందించే వ్యవసాయ అనుబంధ పథకాలకు తప్పనిసరి, అలాగే రైతులు సాగుచేసిన ప్రతి పంటను తప్పనిసరిగా పంట నమోదు చేసుకుంటే ప్రభుత్వ పథకాలు సబ్సిడీలు పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమములో మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి, సెరికల్చర్ అధికారి గుర్రప్ప, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ


**తంబళ్లపల్లె ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ః**



మండలంలోని హైస్కూల్లు, ప్రైమరీ పాఠశాలల్లోని 5142 విద్యార్థులకు గాను 5017 మంది 97. 57 విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు కోసువారిపల్లి పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాదియా తెలిపారు. ఈ సందర్భంగా కోసువారిపల్లె హై స్కూల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆల్ బెండజోల్ మాత్రలు మింగడం వలన కడుపులోని నులిపురుగులు నశించి భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు ఉండమన్నారు. ఈ మాత్రలు మింగడం వలన ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. అనంతరం ఆమె విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజు, హెడ్మాస్టర్, అధ్యాపకులు, సిహెచ్ఓ ఆదిలక్ష్మి, ఏఎన్ఎం ప్రమీల, మేల్ వర్కర్ కృష్ణా నాయక్, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల దినోత్సవం

**నిమ్మనపల్లి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**



జాతీయ నులిపురుగుల దినంను పురస్కరించుకొని నిమ్మనపల్లి మండలం నందు స్కూల్స్, అంగన్వాడీ, కాలేజ్ మరియు బడి బయట ఉన్న 1సం"నుండి 19 సం "ల పిల్లలు 5755 మంది ఉన్నారని వీరందరిలో 5654 మంది పిల్లలకు ఈ రోజు ఆల్బండాజోల్ మాత్రలు మింగిచామని 98.25 శాతం సాధించామని డాక్టర్ ప్రత్యుష తెలిపారు. మిగిలినవారికి మాపప్ రోజున మింగిస్తామని తెలిపారు.దీనివలన పిల్లలో వున్న నులిపురుగులును నిర్మూలించి వారి ఆరోగ్యమునకు ఎంతో ఉపయోగం అన్నారు. పిల్లలు ప్రతిరోజు చేతులు శుభ్రముగా ఉంచుకోవాలని, భోజనంకు ముందు మరియు కాలకృత్యాలు తీర్చుకొన్న తరువాత చేతులు కాళ్ళు శుభ్రముగా కడుక్కోవాలని తెలిపారు.నులిపురుగులు ఉండడంవలన రక్తహీనత, ఆకలి లేకపోవడం, రోగాలకు గురి కావడం వంటివి జరుగుతాయాన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ముస్తాబైన గంగమ్మ ఆలయం... జాతరకు చేరుకున్న భక్తులు





లక్కిరెడ్డిపల్లి ఫ్రిబ్రవరి 17 ప్రభాతవార్త

నేటి నుంచి ప్రారంభమైన గంగమ్మ జాతరకు ఆలయ ప్రాంగణం బెంగళూరు మైసూర్ నుంచి తెప్పించిన పూలతో గంగమ్మ ఆలయం అంతా అలంకరించారు. గతంలో ఎన్నడైన విధంగా ఈ ఏడాది అత్యంత భవిభంగా దాదాపు 30 రకాల పూలతో ఆలయాన్ని అలంకరించారు. ప్రత్యేక క్యూ లైన్లతో పాటు ఆలయ ప్రాంగణమంతా పుష్పాలతో నగరిక లాడుతోంది. నేటి తెల్లవారుజామున నుంచి చాగల గొట్టపల్లి గంగమ్మ తల్లి జాతరకు చేరుకోగానే గంగమ్మ జాతర మొదలవుతుంది

**గంగమ్మ జాతరకు చేరుకున్న అమ్మవారు**

అమ్మవారి అర్చకులు సెల్లు వంశీయులని గొల్లపల్లి నుంచి సోమవారం రాత్రి అత్యంత వైభవంగా అమ్మవారు గంగమ్మ జాతరకు చేరుకుంది అమ్మవారు జాతర వారు ముందు రోజులు గొల్లపల్లి దేవర్ ఇంటి ఇంటిలో బోర్లు పెట్టి ఉంచుతారు జాతరకు వెళ్లే సమయంలో అమ్మవారిని ఒక దొబ్బల దుంపలో పెట్టుకొని అమ్మవారిని బ్యాండ్ వాయిద్యాలు ఆసాది వాయిద్యాలు అమ్మవారి వేషాదరణ ప్రదర్శనలతో జాతర చేరుకుంటారు మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ ఆదిమూలం వంశీయులు రామచంద్ర భాస్కర రెడ్డి శేఖర్ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సోడి వెంకటేశ్వర్లు అమ్మవారిని దంపలో పెట్టుకొని జాతరకు తీసుకెళ్లారు ఉదయాన్నే చాగలగొట్టపల్లి అమ్మవారు గొల్లపల్లి అమ్మవారు అనంతపురంలో వెలసిన అమ్మవారు ముగ్గురిని కలిపి ఒకే అమ్మవారిని అలంక రూపం చేసి భక్తులకు దర్శనమిస్తుంది.

## యర్రగుంట్లకు ఐఏఎస్ అధికారి రాక



యర్రగుంట్ల ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి శంషుద్దీన్ పరిశీలించారు. ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంలో భాగంగా ఈనెల కేంద్ర బృందం ఐఏఎస్ అధికారి సిద్ధార్థ జైన్ పాఠశాలను సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాలలోని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో యర్రగుంట్ల ఎంఈఓ శివ ప్రసాద్, అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ విజయభాస్కర్, ఉపాధ్యాయులు చంద్రబాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామికి పాలాభిషేకం

బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :



మాఘమాసము పురస్కరించుకొని మంగళవారం సుమిత్రానగర్‌లో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, ఆకు పూజ, సింధూర అర్చన పలు రకాల విశేష పూజలు నిర్వహించడం జరిగింది. పబ్బతి సత్య నారాయణ సతీమణి శ్రీదేవి, అర్బన్ పోలీస్ స్టేషన్ రైటర్ వల్లె ప్రతాప్‌రెడ్డి సతీమణి లక్ష్మి శిరీష కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారు వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేయడం జరిగింది.

## ఇంటర్ పరీక్షలను పక్కబందీగా నిర్వహించాలి

**జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు**



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:

ఇంటర్ మీడియట్ పరీక్షలకు పద్బబందీగా ఏర్పాట్లు చేసి నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని హాలుల సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23నుంచి ఇంటర్ మీడియట్ పరీక్షలు ప్రారంభం అవుతాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు జరుగుతాయని తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 14,607మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 13,328 మంది, బ్యాక్‌లాగ్ 615మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. 51 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8గంటలకల్లా చేరుకోవాలని తెలిపారు. పరీక్షా సమయం 9గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లో అనుమతించబడదని తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు ఎలాంటి సెల్‌పోన్‌లు, ఎలక్ట్రికల్ వస్తువులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబడవన్నారు. ఈ కేంద్రాల్లో సిసి కెమరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేంద్రాల వద్ద ఏదైనా సమస్య వస్తే కంట్రోల్ రూముల వద్ద ఏర్పాటు చేసిన సెల్‌నెంబర్ 9866112750కు తెలియజేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించాలని, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని తెలిపారు. విద్యార్థులకు కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదోడ్లు వసతి కల్పించాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద సిట్టింగ్‌స్కాడ్‌తో పాటు ఫ్లయింగ్‌స్కాడ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిఈఓ సుబ్రమణ్యం, మున్సిపల్ డిఈ శ్రావణి వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ అవగాహన 2 వాక్



ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, నెల్లూరు ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా భారీ స్థాయిలో క్యాన్సర్ అవగాహన వాకథాన్ తో పాటు ప్రజలతో ప్రత్యక్ష అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ భారత్‌లో ప్రతి సంవత్సరం 14 లక్షలకుపైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, వీటిలో అధిక శాతం కేసులు ఆలస్యంగా గుర్తించడంవల్ల ప్రాణాపాయం జరుగుతోందని తెలిపారు. అయితే సమయానికి పరీక్షలు చేయించుకుంటే, ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను పూర్తిగా నియంత్రించవచ్చని స్పష్టం చేశారు. సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి. రంగ రమణ్ మాట్లాడుతూ ఆధునిక కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ వంటి చికిత్సలతో క్యాన్సర్ ఫలితాలు గణనీయంగా మెరుగయ్యాయి. డాక్టర్ ఎం. రమేశ్ బాబు, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ మాట్లాడుతూ ప్రారంభ దశలో గుర్తించిన క్యాన్సర్‌ను శస్త్రచికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చున్నారు. కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి వి., మాట్లాడుతూ క్యాన్సర్‌పై ఉన్న భయాన్ని, అపోహలను తొలగించడమే తమ లక్ష్యమన్నారు. అవగాహన, సమయానికి వైద్య సలహా తీసుకోవడం ద్వారా క్యాన్సర్‌ను జయించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూటు సెంటర్ హెడ్ పవన్, ఆర్య వైశ్య ప్రెసిడెంట్ ఉపేంద్ర డాక్టర్ సురేష్ కుమార్ రెడ్డి, డాక్టర్ సూర్య నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## చెరువులో బోర్లు వేయడం వలన నీటి శాతం తగ్గుదల

సుండుపల్లె, పిబ్రవరి, ప్రభాతవార్త :



మండల పరిధిలో రాతి చెరువు ఆక్రమణపై గ్రామస్తులు మంగళవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వెళ్లి వినతిపత్రం సమర్పించారు. గ్రామ పరిధి లోని సర్వే నెం. 1644లో ఉన్న 67.80 సెంట్ల రాతి చెరువు మూడు వైపులా ఆక్రమణ అందులో3.50 సెంట్లు కబ్జా చేసి, డి ఫారం నమోదు చేసుకొని సర్వే నెం. 28632గా నమోదు చేసుకున్నారని రైతులు తెలియజేశారు. ఆక్రమణదారులు చెరువు బోర్లు వేసి సాగు చేయడంతో నీటి నిల్వ గణనీయంగా తగ్గిపోయాయని తెలిపారు. దీంతో ఎగువ ఈడిగపల్లె, సోమలరాజుగారిపల్లె, వెంగంరాజుగారిపల్లె, తొగటపల్లె, పోచంవాండ్లపల్లె, ఎగువ మాలపల్లె, కుమ్మరపల్లె, చాకలిపల్లె, దిగువ మాలపల్లె గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో సంవత్సరానికి రెండు పంటలు పండించే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం ఒక్క పంట కూడా కష్టంగా మారిందని వాపోయారు. పలుమార్లు తహశీల్దారు,ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని గ్రామస్థుడు ఎరికాల కళ్యాణ్ ఆరోపించారు. ఆక్రమణలకు తొలగించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**రాష్ట్ర జంగమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వాసునూరు చంద్రశేఖర్**




మంత్రికి సమస్యలను వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పీలేరు ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందించి కృషి చేస్తామని రాష్ట్ర జంగమ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర జంగమ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్, విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రజలు తమ సమస్యలను వినతి పత్రాలతో విన్నవించు కున్నారు. ప్రతి సమస్య పరిష్కార మార్గం దిశగా క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు తెలుసు కున్నారు.సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి వెంటనే పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు.

## పేద విద్యార్థులకు 'గురుకుల విద్య' వరం

**ఫిబ్రవరి 19లోపు ప్రవేశాలకు దరఖాస్తు చేయాలి**



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

పులివెందుల, ఫిబ్రవరి 17, ప్రభాత వార్త :

గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, తొండూరు మండల టీడీపీ పరిశీలకుడు మారెడ్డి భరత్ రెడ్డి పేర్కొన్నా రు.మంగళవారం పులివెందులలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందం మర్యాదపూర్వకంగా వారిని కలిసింది. ఈ సందర్భంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి మరియు ఇంటర్మీడియట్ ప్రవేశాల ప్రచార పోస్టర్లను నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందిస్తున్న గురుకుల పాఠశాలల్లో చేరేందుకు అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పిం చాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదవకాశాన్ని నియోజకవర్గంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని కోరారు.ఈ కార్యక్ర మంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిడిపికి పూర్వ వైభవం తీసుకొస్తా: సూర్యనారాయణ రెడ్డి

పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:



పట్టణంలోని సొసైటీ కార్యాలయాన్ని డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. రైతులకు ఆర్థిక భరోసా కోసం మా బ్యాంకు ద్వారా అన్ని విధాల రుణాలు అందిస్తున్నామన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ద్వారా లబ్ధి చేకూరింది అన్నారు. చెప్పిన ప్రతి మాట నెరవేరుస్తూ సంక్షేమ అభివృద్ధితో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో సీఎం చంద్రబాబు నడిపిస్తున్నారన్నారు. బద్వేల్ నియోజకవర్గానికి టిడిపిలో పూర్వ వైభవం తీసుకొస్తానని ఆయన అన్నారు. నియోజవర్గంలోని ప్రతి గ్రామం తిరిగి పార్టీ బలోపేతానికి కృషి చేసి రాబోయే ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీతో బద్వేల్లో టిడిపి జెండా ఎగరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు చెరుకూరి రవికుమార్, భైరవ ప్రసాద్, బాలిరెడ్డి తదితరులు ఉన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



దేశవ్యాప్తంగా వెలువడిన జేఈఈ. మెయిన్-2026 (ఫేజ్-1) ఫలితాల్లో బద్వేల్ పట్టణంలోని డా. బీజెఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి నల్దేశి సుధీక్షిత్ 96.74 శాతం సాధించి కళాశాలకు కీర్తి తీసుకొచ్చాడు. విద్యార్థి విజయంపై కళాశాల కరస్పాండెంట్ బి. జయ సుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు. అధ్యాపకుల శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థి పట్టుదల ఫలితంగానే ఈ విజయాన్ని సాధించగలిగామని పేర్కొన్నారు. సుధీక్షిత్ తండ్రి సుబ్బారాయుడు మాట్లాడుతూ సుభాష్ గాయత్రి కళాశాల మాజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసినట్లు తెలియజేస్తూ, తన కుమారుడి విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. అధ్యాపక బృందానికి, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు బి. వీరశేఖర్ రెడ్డి, బి. శివశంకర్ రెడ్డి, బి. గురవయ్య, బి. సుదర్శన్ రెడ్డి, జి. వినోద్, ఏ. పోలిరెడ్డి, ఎన్. నరసింహ, కె. మస్తాన్ రెడ్డి, ఆర్. సురేష్ బాబు, కె. రామకృష్ణ, పి. జాకీర్ హుస్సేన్, బి. కాశి, కె. గౌరి శంకర్, కె. జయ సుబ్బారెడ్డి, కె. వెంకట రామిరెడ్డి, జి. ఓబయ్య, కె. రాయుడు, ఎం. సురేష్ లు విద్యార్థి విజయం పై హర్షం వ్యక్తం చేశారు.

## మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలింపు

**హుటాహుటిన పోస్టుమార్టం పూర్తి**



మదనపల్లె క్రైమ్ ఫిబ్రవరి 17 ప్రభాతవార్త.

మదనపల్లెలో దారుణ హత్యకు గురైన రిషిక ప్రియా మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. న్యాయం జరిగే వరకూ తీసుకెళ్లడానికి వీలు లేదంటూ బాలిక తల్లిదండ్రులు, స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగించారు. ఉదయం నుంచి మదనపల్లి పోలీసులు పలుమార్లు వారితో చర్చించిన నిరాకరించారు. మదనపల్లి అన్నమయ్య సర్కిల్లో ప్రజలు భారీ ఎత్తున ఆందోళన కొనసాగించి సుమారు 8 గంటలకు పైగా ధర్నా నిర్వహించారు. వాహన రాకపోకలకు తీవ్ర అంతనాయం ఏర్పడింది. కడప జిల్లా ఎస్పీ నశికేత్ విశ్వనాధ్ మదనపల్లి చేరుకుని బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి న్యాయం చేస్తామంటూ హామీ ఇవ్వడంతో వారు శవ పరీక్షలు అంగీకరించారు. భారీ బందోబస్తు మధ్య బాలిక మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ఆసుపత్రి మార్చరికి తరలించారు. హుటా హుటిన వైద్య బృందంతో శవపరీక్షలు పూర్తి చేయించారు. మృతదేహాన్ని కడప జిల్లా వీరబల్లి మండలం రాగిమానుదిన్నెపల్లి కి తరలించి అక్కడే అంత్యక్రియలు పూర్తి చేయనున్నారు. కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మదనపల్లికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. నిందితునికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని డిఐజి తెలిపారు.


## ఆలయానికి రూ 18,74,954 ఆదాయం



తంబళ్లపల్లె ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ః

మల్లయ్యకొండ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయానికి హుండీల ద్వారా భక్తులు రూ 18,74,954 లక్షలు ఆదాయం వచ్చినట్లు టెంపుల్ ఇన్స్పెక్టర్ శశి కుమార్, ఈవో ముని రాజా, రికార్డ్ అసిస్టెంట్ కొండకిట్ట లు విలేకరుల తెలిపారు. మంగళవారం ఉదయం పోలీసులు, ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, అధికార పార్టీ నాయకులు, అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు జరిగింది. సాధారణ హుండీ ద్వారా రూ 14,40,650, లక్షలు చదివింపులు ద్వారా రూ 28,000 వేలు, తాత్కాలిక హుండీ ద్వారా రూ 1,24,809 లక్షలు, టికెట్లు ద్వారా రూ 2,81,496 లక్షలు మొత్తం రూ 18,74,954 ఆదాయం సమకూరింది. నగదు తో పాటు బంగారు, వెండి వస్తువులు భక్తులు కానుకగా సమర్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అనిల్ కుమార్, టిడిపి నాయకులు తులసీదర్ నాయుడు, ఉత్తమ రెడ్డి, సోమశేఖర్, రామచంద్ర, కాలా నారాయణ, వెంకటరమణ, బాలకృష్ణారెడ్డి, నరసింహులు, శంకర, బిజెపి నాయకులు రమణ, లక్ష్మయ్య, అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామి తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్ ఫలితాల్లో విద్యార్థుల ప్రభంజనం



మదనపల్లి క్రైమ్ ఫిబ్రవరి 17 ప్రభాతవార్త.

జేఈఈ మెయిన్స్ సెషన్1 ఫలితాల్లో మదనపల్లెకు చెందిన వెంకట రెడ్డి శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయి పరీక్షలో వెంకట్ రెడ్డి సిద్ధార్థ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించారు. ముగ్ధ మేఘన 95.92 పర్సంటైల్, రామ్ చరణ్ రెడ్డి 91.74 పర్సంటైల్, అఫ్తాన్ బేగ్ 89.82 పర్సంటైల్, గమ్య శ్రీ 87.16 పర్సంటైల్, స్పందన 87.01పర్సంటైల్ సాధించారు. వీరితో పాటు మరో 22 మంది విద్యార్థులు 75 పర్సంటైల్ పైగా సాధించినట్లు కరస్పాండెంట్ వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రెడ్డి, డైరెక్టర్ హేమంత్ కుమార్లు అభినందించారు. క్రమశిక్షణతో కూడిన శిక్షణ, నిష్ణాతులైన అధ్యాపకుల బోధన, విద్యార్థుల నిరంతర శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు.

## పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

బద్వేలు అర్బన్ ఫిబ్రవరి 17 : ప్రభాతవార్త :



మున్సిపాలిటీలోని ప్రజలు, వ్యాపారస్తులు మున్సిపాలిటీకి చెల్లించవలసిన పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ వాకమల్ల వెంకట నరసింహారెడ్డి అన్నారు, మంగళవారం మునిసిపల్ రెవిన్యూ సిబ్బందితో పన్ను వసూలుపై మునిసిపల్ ఆఫీస్ నందు సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి ఇచ్చారు, ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వాకమల్ల వెంకట నరసింహారెడ్డి మాట్లాడుతూ సత్వరమే పన్నులు చెల్లించాలని పట్టణాభివృద్ధికి తోడ్పాటు అందించి.టాప్ 100 మొండి బకాయిదారుల జాబితా బహిరంగ ప్రదేశాల్లో, కూడళ్ళలో త్వరలో ప్రదర్శన.యజమానులు అందుబాటులో లేకపోతే అద్దెదారులకు నోటీసులు.ఖపన్నులు చెల్లించడం వల్ల పట్టణంలో రోడ్లు, శానిటేషన్, వీధి దీపాలు వంటి సేవలు మెరుగుదలకు తోడ్పాటు జరుగుతుందన్నారు, ఏళ్ళ తరబడి బకాయిలు ఉన్న పన్ను ఎగవేతదారులు తక్షణమే పన్నులు చెల్లించక పోతే వ్యాపార సముదాయాలు సీజ్ తొలుత డిస్ట్రెస్ వారెంట్లు - అనంతరం జప్తు ప్రక్రియ ప్రారంభం పన్నుల వసూళ్లకు సిబ్బంది తో 23 టీమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, సిబ్బంది అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు అని మున్సిపల్ కమీషనర్ నరసింహారెడ్డి తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో కమీషనర్ తో పాటు మేనేజర్ హరినాథ్, రెవెన్యూ ఆఫీసర్ గంగిరెడ్డి రెవెన్యూ ఇన్స్పెక్టర్‌లు రఘునాథ్ రెడ్డి, షఫీ, మునిసిపల్ సిబ్బంది మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు దిన్నెపాటి గంగమ్మ

## తల్లి దేవస్థానం వార్షికోత్సవాలు

**పాల్గొననున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి**

పులివెందుల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :

పులివెందుల పట్టణంలోని కదిరి రోడ్డులో వెలసిన దిన్నెపాటి గంగమ్మ తల్లి దేవస్థానంలో వార్షికోత్సవాలు నేడు ఘనంగా నిర్వహించేం దుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా రేపు ఉదయం 7.30 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. అలాగే మునిసిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, తొండూరు మండల ఇంచార్జి వైఎస్ మదన్ మోహన్ రెడ్డి తదితరులు హాజరుకానున్నారు. వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు,అర్చనలునిర్వహించనున్నారు. భక్తుల రాకపోకలకు తగిన ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నా రు.భక్తులందరూ భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

## ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 17 ప్రభాత వార్త

సర్వో దయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని అనిబిసెంట్ మునిసిపల్ హై స్కూల్ నందు బాలురకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య, ఆరోగ్యాధికారి డాక్టర్ గీతా మాట్లాడుతూ మన ఆరోగ్యం, మన భవిషత్తు, మన చేతుల్లోనే ఉంది అన్నారు. ప్రతి ఒక్క బాల బాలికలు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకొని చదువుపై ఏకాగ్రతను, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు., డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఆల్బెండజోల్ మాత్రలు నమిలి మింగడం వలన రక్తహీనతను, పోషకాహార లోపమును, ఆకలి మందగించము, నీరసము, కడుపునొప్పి నీ నివారించటం, వికారము, వాంతులు, బరువు తగ్గడం, జ్ఞాపక శక్తి లేకపోవడం వంటి వ్యాధులను నివారించవచ్చన్నారు. వార్డు హెల్త్ సెక్రటరీ పద్మావతి మాట్లాడుతూ హ్యాండ్ వాష్ గురించి తెలియజేశారు. సిర్డ్ సొసైటీ ప్రసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుని అందరూ ఆరోగ్యంగా ఉండి భవిష్యత్తులో మంచి ప్రయోజకులు కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గీతా ఉపాధ్యాయులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, బాలురు పాల్గొన్నారు.

## వీఆర్వోలు, సర్వేయర్లను మినహాయించాలి

దువ్వూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:



అమరావతి రెవెన్యూ జేఏసీ పిలుపు మేరకు మండలంలోని విఆర్వోలు, సర్వేయర్లు రెవెన్యూ సహాయకులు డిమాండ్ల సాధన మేరకు స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం డిప్యూటీ తహసిల్దార్ వేణుగోపాల్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పని ఒత్తిడితో ఉన్నారని అలాగే మండలంలో రీ సర్వే జరుగుతుందని అందువల్ల ప్రభుత్వం నిర్వహించే వివిధ రకాల సర్వేల నుండి తమను మినహాయించాలన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన అమలు కావడం లేదన్నారు. తహసిల్దార్ ఆధ్వర్యంలో తమకు జీతాలు ఇవ్వాలని అప్పుడే తమకు న్యాయం జరుగుతుందన్నారు. తమ డిమాండ్ల సాధన కొరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని విఆర్వోలు, సర్వేయర్లు, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ




పలకలచెరువు ఫిబ్రవరి 17 ప్రభాతవార్త

మండలంలోని అన్ని పాఠశాలల్లో 7301మంది విద్యార్థులకు గాను 7090 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు పిహెచ్సీ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా సోంపల్లి జెడ్పి హైస్కూల్ ఎంపీడీవో హరినారాయణ, ఎంఈఓ వెంకటరమణలు విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ బెండజోల్ మాత్రలు మింగడం వలన కడుపులోని నులిపురుగులు నశించి భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు ఉండమన్నారు. ఈ మాత్రలు మింగడం వలన ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా రోడ్డుకు మరమ్మతు పనులు

**- చోద్యం చూస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు**

కలికిరి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:



కలికిరి మండల కేంద్రంలో గుంతలు పడిన రోడ్డుకు కాంట్రాక్టర్ ఎలాంటి నాణ్యత లేకుండా తూతూ మంత్రంగా పనులు చేపడుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని అధికారుల పనితీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కలికిరి క్రాస్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు అదే విధంగా కలికిరి-కలకడ రోడ్డు మార్గంలో పెద్దగుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో ప్రభుత్వం రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసి టెండర్లు పిలవడం జరిగింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏమాత్రం నాణ్యత లేకుండా గుంతలకు తారుతో ప్యాచ్‌లు వేస్తూ తూతూ మంత్రంగా పనులు చేపడుతున్నాడు. ఆ పనులు చూస్తున్న వాహనదారులు, స్థానికులు ఆ పనులపై విమర్శలు గుప్పిస్తున్నారు. పనులు పర్యవేక్షించాల్సిన ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు పనులు పర్యవేక్షించకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఏమాత్రం చిన్నపాటి వర్షం పడినా మరమ్మతులు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పనులను నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.